క్లుప్తంగా

ఎస్టీపీ కేంద్రాల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ పరిధిలోని జనార్దన్‌రెడ్డికాలనీ, అల్లీపురం ప్రాంతాల్లోని మురుగునీటి శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ)తో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించనుందని కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు. అల్లీపురంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పబ్లిక్ హెల్త్, ఎల్అండ్‌టీ, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఎస్టీపీలను నడిపించేందుకు అవసరమైన సాంకేతిక అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎస్టీపీల ప్రారంభానికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చి అత్యంత వేగవంతంగా సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ఎల్అండ్‌టీ కార్యాలయంలో అధికారులతో కలిసి వివిధ అంశాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, ఎల్అండ్‌టీ అధికారులు, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా 'నా భూమి-నా దేశం'



నెల్లూరు(బారకాసు): నగరంలోని 14వ డివిజన్, బాలాజీనగర్‌లోని వేపదొరువు ప్రాంతంలోని పబ్లిక్ పార్కులో 'నా భూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమాలను శనివారం వేడుకగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. పలువురు స్వాతంత్ర సమరయోధులను సత్కరించి మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. స్థానిక నాయకులు, అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం



నెల్లూరు(బారకాసు): ప్రముఖ న్యాయవాది, ఐఆర్‌సీఎస్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ మద్రాసుబస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో శనివారం 45వ సారి రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, డిజాస్టర్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు, సాయిరాం, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



సాక్షి, నెల్లూరు: రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నాన్ని నగరంలోని ఆయన నివాసంలో బాల్యమిత్రుడు మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం శనివారం కలుసుకుని పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రత్నం ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం కొద్దిసేపు బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుల ఆదేశాల మేరకు నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్యకళాశాలలో సీనియర్ రెసిడెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ జమున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని క్లీనికల్, నాన్ క్లీనికల్ విభాగాల్లో ఏడాది పాటు తాత్కాలిక పద్ధతిలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 21న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు spsrnellore.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేట, ఉప్పరపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మువ్వ ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో రెండోరోజైన శనివారం విఘ్నేశ్వరపూజ, విశేష హోమాలు, నూతన సీతారామలక్ష్మణుల విగ్రహాలకు విశేషాభిషేకాలు, పూజలు , నగరోత్సవం నిర్వహించారు.

అమరవీరుల త్యాగఫలమే స్వాతంత్య్రం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్/నెల్లూరు(బారకాస్): అమరవీరుల త్యాగఫలమే స్వాతంత్య్రమని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 23వ డివిజన్, పడారుపల్లిలోని మారుతి పార్కులో 'నా భూమి-నా దేశం', 'నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఆదాల పాల్గొని అమరవీరుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటి జెండా వందనం సమర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చాక భారతదేశం ఎంతో వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం ప్రపంచదేశాల్లో నాలుగో స్థానానికి చేరామని తెలిపారు. 2047 నాటికి మనం మొదటి స్థానానికి రావాలని ప్రధాన నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. దేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొంది ఈ స్థాయికి రావడానికి ఎంతో మంది నాయకులు, త్యాగధనులు జీవితాలను అర్పించారని గుర్తు చేశారు. వారిని స్మరించుకోవడం, భావితరాలకు వారి త్యాగాన్ని తెలియజేయడం మన భాధ్యత అన్నారు. దేశ రక్షణ కోసం పనిచేసిన సాయుధ వీరులను సత్కరించుకోవడం మన అదృష్టమన్నారు. అమరవీరుల కుటుంబాలను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని చక్కగా ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలిపారు. మారుతి పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ వికాస్‌మర్మత్‌ను కోరారు. అనంతరం మాజీ సైనికులను సత్కరించారు. కమిషనర్ వికాస్‌మర్మత్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్ కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు గౌరి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మొబీనా, అవినాష్, నూనె మల్లికార్జున యాదవ్, బొబ్బల శ్రీనివాసయాదవ్, సత్తార్, వైఎస్సార్‌సీపీ నాయకులు స్వర్ణ వెంకయ్య, కోటేశ్వర్ రెడ్డి, హరిబాబుయాదవ్, జెడ్పీటీసీ మల్లు సుధాకర్ రెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, జీవీఎస్ ప్రసాద్, పాతపాటి పుల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నారాయణ, పాలకీర్తి రవి, టీవీఎస్ కమల్, హరిశ్చంద్రారెడ్డి, సురేష్‌బాబు, శివ సునీల్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, నిజాముద్దీన్, యేసు నాయుడు, సూరిబాబు, నర్సింహారావు, మేఘనాథ్‌సింగ్, అల్లాభక్షు, తదితరులు పాల్గొన్నారు.

ఏ కష్టం,నష్టం వచ్చినా ప్రజల్లోనే



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

• నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగర ప్రజలకు ఏదైనా కష్టం వచ్చినా, నష్టం వచ్చినా వారితోనే ఉన్నామని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 43వ డివిజన్ పెద్దబజారు, దాడివారి వీధి, డైకస్‌రోడ్డు, చేపల మార్కెట్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..లేదా..అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా అందకపోతే అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లగా నగరంలో కనిపించని కొందరు ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రస్తుతం హడావిడి చేస్తూ కొత్త విన్యాసాలతో ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. కానీ తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నానన్నారు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరోనా సమయంలో ఒక్కరికి కూడా సాయం చేయని ఒకాయన నిన్నటి రోజున ఒక కుటుంబానికి దుస్తులు దానం చేశానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన విద్యా సంస్థల్లో ఫీజు చెల్లించలేని విద్యార్థులను బయటకు తరిమేసిన చరిత్రే తప్ప, కనీసం ఏ ఒక్క విద్యార్థికైనా ఫీజు తగ్గించారా అని ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రజలకు ఏదైనా కష్టం వస్తే ఆయా ప్రాంతాలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలకు చెప్పుకుంటారన్నారు. కానీ ప్రస్తుతం ఆయన పక్కన తిరిగేందుకు నాయకులు, కార్యకర్తలు లేక రాష్ట్రంలోని వారి సిబ్బందితో తిరుగుతున్నారన్నారు. ఆ సిబ్బంది ఏమైనా ప్రజల కష్టం తీర్చగలరా..? టీడీపీ నాయకుల కష్టాలను తీర్చేగలిగే ఆలోచన మీ నాయకుడికి ఉందా అని ప్రశ్నిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఏ రోజూ గుర్తుపట్టని నాయకుడి కోసం కష్టపడి మోసపోవద్దని, ఏ రోజైనా మీ కోసం నేనున్నానని భరోసా ఇచ్చారా..? ఒక్కసారి ఆలోచించుకోవాలని సూచిస్తున్నామన్నారు. నగర నియోజకవర్గంలో ఏ రోజూ తానుగానీ, తమ పార్టీ నాయకులుగానీ వ్యాపారుల జోలికి రాలేదన్నారు. కానీ ఏ నాయకుడు వచ్చినా ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టండి అంటూ కొందరు వస్తారని, జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నామన్నారు. అప్పుడు వ్యాపారులకు ట్యాక్స్‌లు ఏ రూపంలో వస్తాయో అని అర్థమవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో కాలువల పక్కన ఉన్న నాలుగువేల కుటుంబాలను తొలగించేందుకు మార్కింగ్‌లు చేయగా, తమ ప్రభుత్వంలో ఆ కుటుంబాలను కాపాడుతూ ఆ కాలువల నుంచి మురుగునీరు ఇళ్లలోకి రాకుండా ప్రహరీలు నిర్మిస్తున్నామని తెలిపారు. వేలాది ఎకరాలకు సాగునీరందించే కాలువలకు ఇరువైపులా గోడలు నిర్మిస్తే ఏదో రెండు పిల్ల కాలువలకు నిర్మించారని కొందరు మాట్లాడుతున్నారని, వారిని చూస్తుంటే వారి జ్ఞానం ఏ పాటిదో అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాలనేరస్తుల రహిత సమాజానికి కృషి చేయాలి

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని



మాట్లాడుతున్న జడ్జి యామిని

నెల్లూరు (లీగల్): బాల నేరస్తుల రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సీ యామిని పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవనంలో జువైనల్ చైల్డ్ వెల్ఫేర్, పోలీసు అధికారులు, జువైనల్ పోలీస్ యూనిట్ ప్రత్యేక సభ్యులకు జువైనల్ జస్టిస్ చట్టంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయ యామిని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల నేరస్తులకు అందించే సౌకర్యాల్లో ఎటువంటి వివక్ష చూపరాదన్నారు. వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ బాలలకు తగిన అవగాహన, పరిజ్ఞానం లేకపోవడంతో బాల నేరస్తులు అవుతున్నారన్నారు. వారిలో అవగాహన పెంచాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రెండో అదనపు జిల్లా జడ్జి సీ సత్యవాణి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను సక్రమంగా పట్టించుకోకపోవడంతో బాల నేరస్తులుగా మారుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంపై సరైన అవగాహన కలిగి ఉండాలని, తద్వారా బాల నేరస్తుల రహిత సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. అనంతరం బాల నేరస్తుల ప్రవృత్తి, అలవాట్లు, నేరస్తులుగా మారడానికి గల కారణాలు, బాల నేరస్తులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ శాఖలు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, దిశా పోలీస్ స్టేషన్ సీఐ ఎం రామారావు, సీడబ్ల్యూ పర్సన్ టీ మాధవి, డీసీఆర్బీ ఎస్సై దాలిదాస్, డాక్టర్ ప్రమోద్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఆరో డివిజన్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వంద మందికి నూతన కార్డులను పంపిణీ చేసినట్లు ఆరో డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మద్దినేని శ్రీధర్ తెలిపారు. సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): జీజీహెచ్ ఆవరణలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..ఈ నెల 17న కృష్ణపట్నం జీరోపాయింట్ జంక్షన్ వద్ద 60ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో పడి ఉండగా 108 సిబ్బంది జీజీహెచ్‌లో చేర్పించారు. అప్పట్నుంచి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 18న రాత్రి క్యాజువాల్టీ ఎదురుగా అపస్మారక స్థితిలో పడిఉండగా గమనించిన సెక్యూరిటీగార్డు ఎం సురేష్‌కుమార్ హుటాహుటిన వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే వృద్ధుడు మృతి చెందాడని చెప్పారు. ఈ మేరకు సెక్యూరిటీగార్డు దర్గామిట్ట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ప్రిస్కిప్షన్‌లో మృతుడి పేరు కోటేశ్వరరావు అని ఉంది. మిగిలిన వివరాలు తెలియరావాల్సి ఉంది.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

• కమిషనర్ వికాస్‌మర్మత్



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ పరిధిలోని జగనన్న కాలనీ లేఅవుట్లలో చేపడుతున్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో గృహ నిర్మాణాల పురోగతిని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతుల కల్పనకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. కార్పొరేషన్ ద్వారా సాంకేతిక అనుమతుల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వందశాతం నిర్మాణ పనులు పూర్తయిన గృహాలను వెంటనే లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శ్లాబ్ నిర్మాణం పూర్తి చేసుకున్న గృహాల లబ్ధిదారులకు మెప్మా ద్వారా వడ్డీలేని రుణాన్ని అందించి అదనపు వసతులు కల్పించి అప్పగించాలన్నారు. జగనన్న కాలనీ నిర్మాణ సమయం నుంచే పనుల పర్యవేక్షణకు లబ్ధిదారుల రాకపోకలకు రవాణా సౌకర్యం కల్పించాలని కమిషనర్ సూచించారు.

సచివాలయాల్లో తనిఖీలు

నగర పాలక సంస్థ పరిధిలోని జేమ్స్‌గార్డెన్, కాపు వీధిలోని వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్‌మర్మత్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఎస్‌డీజీ సర్వే, భూసర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు.

అన్నదానం ఎంతో గొప్పది

•ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): అన్ని దానాల్లోకి అన్నదానం ఎంతో గొప్పదని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్) ప్రాంగణంలో హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుభోజనం కార్యక్రమాన్ని కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి ఎంపీ ఆదాల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ దేశ వ్యాప్తంగా అన్నదాన కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. అందులో భాగంగా జీజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయకుల ఆకలి తీర్చేందుకు సుభోజనం కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు అనారోగ్యంతో జీజీహెచ్‌కు వస్తుంటారని, వారికి సహాయకులుగా వచ్చే వారి ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సుభోజనం కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. మంచి ఆలోచనతో ముందుకు వెళ్తున్న ఆర్గనైజేషన్, అందుకు సహకారం అందిస్తున్న దాతలను అభినందించారు. ఈ కార్యక్రమానికి సహాయసహకారాలను అందించాలని జీజీహెచ్ వైద్యాధికారులకు సూచించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు వంశీధరదాస్ మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారి క్షుద్బాధను తీర్చడమే సుభోజనం కార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు విలాస్‌విగ్రహదాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నరేంద్ర, వైఎస్సార్‌సీపీ నేత ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కొనసాగిన అఖండ వేదపారాయణ సప్తాహం



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖండ వేదపారాయణ సప్తాహం రెండో రోజు శనివారం కొనసాగింది. దక్షిణామ్నాయ శృంగేరిపీఠం ఉత్తర మహాసంస్థానాధీశులు జగద్గురు విధుశేఖర భారతిస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మశ్రీ గుళ్లపల్లి శివశర్మ అవధాని పర్యవేక్షణలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వేదపండితులు వేదపారాయణాన్ని కొనసాగించారు. ఆధాత్మిక కార్యక్రమాల్లో భాగంగా లక్ష్మీకామాక్షి శిష్యబృందం శ్రీశంకరభగవత్పాద విరచిత సౌందర్యలహరి స్తోత్ర గానం చేశారు.

మనిషి ఆలోచనా విధానాన్ని మార్చిన ఫొటోగ్రఫీ



నెల్లూరురూరల్: కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నెల్లూరు రూరల్ : మనిషి ఆలోచనా విధానాన్ని ఫొటోగ్రఫీ మార్చిందని, నేటి సాంకేతిక యుగంలో ఫొటోగ్రఫీ ఆలోచన నుంచి పుట్టిన అనేక అంశాలు మనిషికి అండగా నిలుస్తున్నాయని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరావస్తు నాగసాయి సూరి తెలిపారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డైకస్‌రోడ్డు సెంటర్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కెమెరా రూపకర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వేల మాటలు చెప్పలేని భావాలను ఒక్క ఫొటో తెలియజేస్తుందన్నారు. కెమెరా సృష్టితో మన జీవితాలు ఫొటోల రూపంలో పదిలంగా నిలిచాయన్నారు. నేడు మన జీవితంలో సాధారణ అంశాలు మొదలుకుని జర్నలిజం, రక్షణ, వైద్యం వంటి అనేక రంగాల్లో ఫొటోగ్రఫీ ప్రాధాన్యం మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అనుమల జయప్రకాష్, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, మెంబర్ నారాయణ, జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఖాజా మస్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

నెల్లూరు(మినీబైపాస్): ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో నగరంలో ప్రెస్‌క్లబ్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రాఫర్లు ఆనందోత్సాహాలతో కేక్ కట్ చేసి ఫొటోగ్రఫీలో తమతమ తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఫొటో జర్నలిస్టులు నందా మాల్యాద్రి, దేవసహాయం, వెంకట్రావు, ముజ్జు, జాకీర్, విజయ్‌కృష్ణ, గణేష్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

నెల్లూరు (టౌన్): కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల్లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయులను నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్, ఆర్థిక కార్యదర్శి నరసింహులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపల్ పాఠశాలల్లో సుమారు 300 మందికిపైగా ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. 50 ప్రాథమిక పాఠశాలల్లో 100 మంది, 46 ఉన్నత పాఠశాలల్లో 200 మంది ఉపాధ్యాయులు అవసరం ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని తెలిపారు. ఈ కారణంగా సిలబస్ పూర్తవక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం తలపెట్టిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(బారకాసు): దోమల నియంత్రణ అందరి బాధ్యతని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. ఈ నెల 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని డీఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దోమ కాటుతో ఏటా లక్షలాది మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. దోమల నియంత్రణకు ఏటా ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సక్రమిస్తుందన్నారు. మలేరియాను వ్యాప్తి చేసే ప్లాస్మోడియం పరాన్నజీవి జీవిత చక్రాన్ని 'సర్ రోనాల్డ్‌రాస్' అనే శాస్త్రవేత్త ఆగస్టు 20న కనుగొన్నారని, ఇందుకు సంబంధించి ఆయనకు 1902లో నోబెల్ బహుమతి లభించిందని తెలిపారు. దోమ మనిషిని కుట్టినప్పుడు మలేరియా పరాన్నజీవి మానవ శరీరంలోకి ప్రవేశించి మలేరియా జ్వరాన్ని కలుగజేస్తుందని వివరించారు. జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా నియంత్రణకు వైద్యారోగ్యశాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించడం, ఇంటింటి లార్వా సర్వే చేపట్టడం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా సహాయక మలేరియా అధికారి నాగార్జున, డీఎల్ఏటీఓ అమరేంద్రనాథ్‌రెడ్డి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ అధికారి దయాకర్, డిప్యూటీ డెమో కనకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

భవ్యహాసినికి నోబెల్ వరల్డ్ రికార్డు



భవ్యహాసినికి నోబెల్‌వరల్డ్ రికార్డును అందజేస్తున్న ప్రిన్సిపల్ మీరా ప్రసాద్

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన నల్లంగు భవ్యహాసిని భరతనాట్యంతో 14 కిలోమీటర్ల తిరువణ్ణామలై ప్రదక్షిణ చేసి నోబెల్ వరల్డ్ రికార్డు అందుకుంది. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో భవ్యహాసినిని ప్రిన్సిపల్ మీరా ప్రసాద్, వైస్‌ప్రిన్సిపల్ సురేష్ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న భవ్యహాసిని గత ఆరేళ్లుగా భరతనాట్య సాధన చేస్తోందని తెలిపారు. గత పది నెలలుగా వివిధ ఆలయాల్లో, ప్రదేశాల్లో నాలుగు గంటల పాటు నిర్విరామ ప్రదర్శనలు చేసిందని చెప్పారు. అదే స్ఫూర్తితో గత నెల 23న తిరువణ్ణామలై ప్రదక్షిణను భరతనాట్యంతో 3.36గంటల్లో పూర్తిచేసి అవార్డును అందుకుందని తెలిపారు. ఇప్పటికే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును సొంతం చేసుకున్న భవ్యహాసిని భవిష్యత్తులో మరిన్ని అవార్డులను సాధించాలని కాంక్షించారు. భవ్యహాసిని గురువులు కళాదీప్తి కామాక్షీసుబ్రహ్మణ్యంను ప్రశంసించారు.

దిగొచ్చిన టమాటా ధరలు

నెల్లూరు(సెంట్రల్): గత రెండు నెలలుగా కొండెక్కి కూర్చున్న టమాటా ధరలు దిగొచ్చాయి. జూన్ చివరి వారం నుంచి టమాటా ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. వర్షాలతో టమాటా పంట దెబ్బతినడంతో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. జూలై నుంచి ఆగస్టు మొదటి వారం వరకు దాదాపు కిలో రూ.200 వరకు పలికాయి. ప్రస్తుతం పంట అందుబాటులోకి రావడంతో ధరలు అమాంతం తగ్గాయి. మార్కెట్లో మొదటి రకం టామాటాలను కిలో రూ.50కే విక్రయిస్తున్నారు. రెండో రకాన్ని కిలో రూ.25 నుంచి రూ.30లోపు విక్రయాలు చేస్తున్నారు. కాగా పచ్చిమిర్చి కూడా కిలో రూ.150 వరకు వెళ్లింది. ప్రస్తుతం వాటిని కూడా కిలో రూ.50 వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీటితో పాటు అన్ని రకాల కూరగాయల ధరలు తగ్గాయి.